# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

మంగళవారం | 21 జూలై, 2026 | పేజీలు : 06


## ప్రజావాణిలో అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

### కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రజావాణిలో ప్రజలు అందజేసిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, ప్రజావాణిలో మొత్తం 78 దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. అధికారులు ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి, బాధితులకు తగిన న్యాయం జరిగేలా పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం, జిల్లాలో జరిగే ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్ఓ వసంత కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డితో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దర్గా ఉర్సు ఉత్సవాలకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

### వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/హనుమకొండ :** ఆగస్ట్ 6 నుంచి 12 తేదీవరకు నిర్వహించనున్న కాజీపేట హజ్రత్ సయ్యద్ షా ఖాద్రీ చిష్తీ దర్గా ఉర్సు ఉత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, దర్గా పీఠాధిపతి, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ కుసూరు పాషా, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న హాజరయ్యారు.ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ శాఖ, విద్యుత్ శాఖ, ట్రాఫిక్ పోలీస్, రెవెన్యూ శాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ, అగ్నిమాపక శాఖ, ఆర్టీసీ, పోలీస్ శాఖ, తాగునీటి సరఫరా శాఖతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొని ఉత్సవాల ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు దర్గాను సందర్శిస్తారని, అలాంటి పరిస్థితుల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం, పారిశుధ్య సిబ్బందిని ప్రత్యేకంగా నియమించడం, ఫాగింగ్, బ్లీచింగ్ కార్యక్రమాలు నిర్వహించడం, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అంబులెన్సులు, వైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని చెప్పారు.ఉత్సవాల సందర్భంగా భారీ జనసందోహం ఏర్పడే అవకాశం ఉన్నందున దర్గా పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు ఆగస్టు 10, 11 తేదీల్లో స్థానిక సెలవులు ప్రకటించాలని సమావేశంలో నిర్ణయించారు.సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయడం, తాత్కాలిక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం, తగినంత పోలీసు బందోబస్తు కల్పించడం, అగ్నిమాపక సిబ్బందిని సిద్ధంగా ఉంచడం, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్ వంటి అన్ని అంశాల్లో శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేస్తామని, ప్రతి శాఖకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించి ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అబూబకర్,అడిషన్ కలెక్టర్ రవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.




## బుస్సాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ హైమావతి అకస్మీకంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో వెజిటేబుల్ బిర్యాని. గుడ్డు, టమాట,కందిపప్పు వేసి చేసిన సాంబార్‌ను పరిశీలించారు. వెజిటెబుల్ బిర్యాని, సాంబారు నాణ్యత మెరుగుపర్చాలని, ఇష్టానుసారంగా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పాఠశాల ప్రాంగణంలో నీరు నిల్వ కుండ చర్యలు తీసుకోవాలన్నారు.నీరు నిలిస్తే దోమలు వృద్ధి చెంది అంటు వ్యాధులు ప్రభలుతాయన్నారు. సీజనల్ వ్యాధులు ప్రభలకుండ అవసరమగు అన్ని చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. అలాగే మండల పరిషత్ పాఠశాలల్లో అన్నం, సాంబారు. గుడ్డు. పప్పును పరిశీలించారు. మెనుప్రకారం వెజిటెబుల్ బిర్యాని చేయలేదని అసహనం వ్యక్తం చేశారు. కామర్ డైట్ తప్పనిసరిగా పాటించాలని, ఏదో ఒకటి నిర్లక్ష్యంగా చేసి పడితే సహించేది లేదన్నారు. వాష్ బెసిన్ నీరు రాకుండ రిపేర్ చేయించాలన్నారు. పాఠశాల ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు. ఆనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. పిల్లలకు అందించే భోజనాన్ని తనిఖీ చేశారు. మెను ప్రకారం పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ టీచర్‌ను ఆదేశించారు. గ్రామంలో సర్ ప్రక్రియపై ఆరా తీశారు. సర్ ఫారాలను డిటైజేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/కొడకండ్ల:** గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, పోషకాహారం అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం జిల్లాలోని కొడకండ్ల మండలంలోని మొండ్రాయి మహాత్మ జ్యోతి బా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలను కలెక్టర్ సందర్శించి విద్యాబోధన, మౌళిక సదుపాయాలు, విద్యార్థుల అభ్యాస సామర్థ్యం, పరిశుభ్రత, ఆహార నాణ్యత, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన కంప్యూటర్ ల్యాబ్‌ను పర్యవేక్షించి కంప్యూటర్ల వినియోగం, విద్యార్థుల కు అందుతున్న డిజిటల్ విద్యా సదుపాయాల గురి ంచి ఆరా తీశారు. ప్రతి విద్యార్థి కంప్యూటర పరిజ్ఞా నం పెంపొందించుకునేలా ప్రణాళికాబద్ధం గా శిక్ష ణ అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రత్యేక చర్యలు**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం మండలంలోని మొండ్రాయి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, పారిశుద్ధ్యం, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీఇంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, గైర్హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారిని పాఠశాలకు పంపించేలా కృషి చేయాలని సూచించారు.



## మన సాంప్రదాయాలే మనకు ముఖ్యం: చిన్నజీయర్ స్వామి



**ప్రజాపక్షం/జనగామ:** మన సాంప్రదాయాలే మనకు అత్యంత ప్రాముఖ్యమని శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామి అన్నారు. జనగామ పట్టణంలోని బాణాపురం వెంకటేశ్వరస్వామి ఆలయంలో సంపత్కుమార కృష్ణమాచార్యాయ సిద్ధాంతి ఆధ్వర్యంలో అత్యంత వైభవముగా మహా సుదర్శణ యాగ ప్రయుక్తముగా జరుగుతున్న వేడుకలలో భాగంగా సోమవారం విశేష సహాస్ర నామార్చన నిర్వయించారు. ఈ సందర్భంగా కోదండరాముడికి చిన్న జీయర్ స్వామి విశేష ఆరాధనని నిర్వయించారు. ఆనంతరం యాగశాలలో పంచకుండ్యాత్మకముగా ఐదు కుండలములతో సుదర్శణ హవనాన్ని నిర్వహించారు. 60 ఏళ్లకు పైబడిన వారంతా ఉగ్రరథ భీమరథ ఐంద్రీ సహాస్ర చంద్ర ధర్శన విశేష ఆరాధనని నిర్వహించి వారి చేతుల మీదుగా భక్తులందరికి తీర్థ వితరణ చేశారు. వంద మంది దంపతుల చేత దంపతీ పూజ నిర్వయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తి వైశిష్ట్యాన్ని వివరించారు. నక్షత్రాలు, తిధులు, వారాలు, కాలం మనకు అనుకూలంగా ఉండేందుకు మన పూర్వీకులు అందించిన సాంప్రదాయాలు అన్నారు. మన సాంప్రదాయాలను మనం పాటించడం వలన ఎక్కువ మేలు జరుగుతుందని వివరించారు.

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ములుగు:** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 82 దరఖాస్తులు రాగా, వాటిలో భూ సమస్యలు 22, ఇందిరమ్మ ఇండ్లు 18, పెన్షన్ 17, ఇతర శాఖలకు సంబంధించినవి 25 ఫిర్యాదు అందాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను అధిక ప్రాధాన్యత ఇస్తూ వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ కృష్ణవేణి, డిఆర్ఓ రవికుమార్, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కుషీల్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ప్రజాపక్షం/నెక్కొండః** గ్రామ ప్రజలకు మెరుగైన మౌళిక వసతులు కల్పించడమే లక్ష్యంగా లావుడ్య వాగ్యానాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా తండాకు చెందిన బోడ సుందర్ ఇంటికి నూతన తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు పనులను గ్రామ సర్పంచ్ భూక్య భాజు మిట్టు, ఉప సర్పంచ్ భీమన్న ఆధ్వర్యంలో పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు గ్రామ పంచాయతీ ప్రాధాన్యతనిస్తూ అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు లావుడ్య జవహర్‌లాల్, భూక్య అలియా, పులియా, విజన్, సుమన్, లావుడ్య ఈరియా, తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు కోతలపై ఎల్కతుర్తిలో బిఆర్ఎస్ మహా ధర్నా



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి:** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద కరెంటు కోతలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ హనుమకొండ కరీంనగర్ ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పిట్టల మహేందర్, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి మహేందర్ గౌడ్, ఎంపీపీ మేకల సప్న మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులకు యూరియా కష్టాలు, తెలంగాణ ప్రజలకు నీటి కష్టాలు, కరెంటు కోతలు మొదలయ్యాయి వర్షాలు లేక రైతాంగం అల్లాడుతుంటే కరెంటు కోతలతో రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం కన్నీళ్లు మిగిలుస్తుందన్నారు. కన్నేపల్లి పంప్ హౌస్ నుండి నీటిని పంపిగ్ చేయాల్సింది పోయి, కాలేశ్వరం ప్రాజెక్టు కూలేశ్వరం ప్రాజెక్టు అని అసత్య ప్రచారం చేస్తూ రెండు పిల్లర్లు కుంగినంత మాత్రాన వాటిని మరమ్మతులు చేయించాల్సింది పోయి తెలంగాణ రైతుల కళ్ళల్లో నీళ్లను నింపుతున్నారు అన్నారు. పంటలకు పారాల్సిన నీళ్లు ఆంధ్ర నాయకుల కనసన్నల్లో ప్రభుత్వాన్ని నడిపిస్తూ తెలంగాణను ఎండబెడుతూ ఆంధ్ర ప్రజలకు అండగా ఉంటూ రైతులకు యూరియా బుకింగ్ అంటూ కొత్త కొత్త నియమాలు సృష్టించి రైతులను రాబందుల పీక్కుతింటున్నారన్నారు. రైతుబంధు సరిగ్గా ఇవ్వకుండా రైతులకు అండగా ఉంటానని హామీ ఇచ్చి ఎన్నికల్లో గెలిచినంక రైతుల పాలిట గుదిబండగా మారారన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, మాజీ వైస్ ఎంపీపీ తంగేడ నగేష్, మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు కడారి రాజు, బిఆర్ఎస్వి నియోజకవర్గ ఉపాధ్యక్షులు గోడిశాల వినయ్ కుమార్ గౌడ్, కడారి రాజారాం, బొంకురి కార్తీక్, వార్డ్ సభ్యులు, మహిళా నాయకులు కృష్ణవేణి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన భట్టు రమేష్



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం జానకి నగర్ తండాకు చెందిన ఆచార్య భట్టు రమేష్ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్, సీనియర్ అధ్యాపకులుగా పని చేసి నేడు ప్రతిష్టాత్మక తెలంగాణ తెలుగు అకాడమీ నూతన డైరెక్టర్‌గా నియమితులయ్యారు. రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయన హైదరాబాద్ లోని అకాడమీ కార్యాలయంలో విధుల్లో చేరారు.తెలుగు భాషా పరిరక్షణ, పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కీలక భూమిక పోషించే తెలుగు అకాడమీ సారధ్య బాధ్యతలను ఆచార్య భట్టు రమేష్ కు అప్పగించడంపట్ల చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకటనారాయణతో పాటు సీనియర్ జర్నలిస్ట్ గాడిపెల్లి మధు గౌడ్,తెలంగాణ ఉద్యమనాయకులు దూడల సాంబయ్య, జైసింగ్ నాయక్ లక్ష్మి నారాయణ మోహన్ సింగ్,గ్రామస్తులు, యువకులు,గిరిజన సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు, హర్షం వ్యక్తం చేశారు.ఆచార్య భట్టు రమేష్ కు ఉన్నత విద్యా రంగంలో మూడు దశాబ్దాలకు పైగా బోధనానుభవం ఉంది. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో రెండు పర్యాయాలు రిజిస్ట్రార్‌గా అత్యుత్తమ సేవలందించారు. వీటితో పాటు జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతిగా, గిరిజన అధ్యయన శాఖ అధిపతిగా, విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యుడిగా పలు కీలక బాధ్యతలను నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆచార్య భట్టు రమేష్ మాట్లాడుతూ తెలంగాణ తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా తెలుగు భాషా వికాసానికి, పాఠ్యపుస్తకాల ప్రచురణకు, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు తన వంతుగా శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు.

## పల్లె నుండి ఐఐటి, ఎన్ఐటికి పయనం



**ప్రజాపక్షం/నెక్కొండః** గ్రామీణ ప్రాంతాల్లో చదివినా పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని నెక్కొండ విద్యార్థులు నిరూపించారు. మండల కేంద్రంలోని గౌతమి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు దేశంలోని ప్రతిష్టాత్మక సాంకేతిక విద్యాసంస్థలైన ఐఐటీ, ఎన్ఐటిల్లో సీట్లు సాధించి పాఠశాలకే కాకుండా మండలానికి గర్వకారణంగా నిలిచారు. పాఠశాల పూర్వ విద్యార్థులు నూతన్ వర్మ ఐఐటీ ధార్వాడ్‌లో, సహజల్ యోధన్ శాస్త్రి ఎన్ఐటి వరంగల్‌లో ప్రవేశం పొందారు. వీరి విజయాన్ని పురస్కరించుకొని పాఠశాలల అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి రవికుమార్ హాజరై విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రవికుమార్ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థుల్లో ప్రతిభకు కొదవ లేదని, సరైన మార్గదర్శనం, కృషి ఉంటే జాతీయ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోగలరని అన్నారు. నూతన్ వర్మ, సహజల్ యోధన్ శాస్త్రిల విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. ఐఐటీ, ఎన్ఐటి, నీట్ వంటి పోటీ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని డిజిటల్ తరగతులు, కాన్సెప్ట్ ఆధారిత బోధన, ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుకర్ రెడ్డి, అనిల్, శ్యామ్ పాషా, మధు, సురేష్, పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## విద్యార్థులపై లాఠీ చార్జికి నిరసనగా కేంద్ర దిష్టిబొమ్మ దగ్ధం



**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** సోమవారం ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జికి నిరసనగా పిడిఎస్‌యు నాయకులు హనుమకొండ కలెక్టరేట్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ ను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా పిడిఎస్ యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ దేశంలో విద్యా వ్యవస్థ అల్లకల్లోలంగా మారిందన్నారు . నీట్ పేపర్ 80 సార్లు పైగా పైగా లీక్ అవడం కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నిర్లక్ష్యమే అని మంత్రి రాజీనామా చేయాలని న్యూఢిల్లీలో రామన్ మెగాసేసే అవార్డు గ్రహీత సోనం వాంగ్ చుక్ గత 20 రోజుల పైగా శాంతియుతంగా అమరణ నిహారదీక్ష చేస్తుండగా అతన్ని పోలీసులు అరెస్ట్ చేయడం అప్రజా స్వామికమన్నారు. ఆయనను తక్షణమే విడుదల చేయాలని, ఢిల్లీ యూనివర్సిటీ, ఇతర కళాశాల విద్యార్థులు ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళుతుండగా వారిపై లాఠీచార్జ్ చేసి టియర్ గ్యాస్ ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై మండిపడ్డారు. తక్షణమే నీట్ పరీక్షను రద్దుచేసి సీట్ పరీక్షను నిర్వహించాలని పేపర్ లీకేజీకి ప్రధాన పాత్ర పోషించినటువంటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు నాయకులు వంగేటి మోహన్, మహేందర్, సుబ్బు, కళ్యాణ్, గణేష్, రమణ, రాజేష్, రాంబాబు, సాయి, అజయ్, రమేష్, శ్రీనివాస్ కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ అండ్ బి శాఖ నూతన ఇఇని కలిసిన టిఎన్‌జిఓస్

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షులు, జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో నూతనంగా జాతీయ రహదారులు మరియు భవనముల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పదవీ బాధ్యత స్వీకరించిన కళ్లెపు కిరణ్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్,గౌరవ అధ్యక్షులు శ్యాంసుందర్, కేంద్ర సంఘం ఉపాధ్యక్షులు భూక్యా రాము నాయక్,జిల్లా నేతలు బింగీ సురేష్, రాజేష్ ఖన్నా, మెహబూబ్, ఆర్ అండ్ బి శాఖ ఉద్యోగులు యూనిస్ ఖాన్,విక్టర్ ,నిఖిల్ రాజ్,శ్రీనివాస్, రాజ్ కుమార్,క్రాంతి, జ్యోత్స్న, సుజాత, షఫీ తదితరులు పాల్గొన్నారు.

## ద్వారక లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా పొడిచెట్టి విష్ణువర్ధన్

**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** లయన్స్ క్లబ్ ఆఫ్ ద్వారక ఉపాధ్యక్షులుగా డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల లయన్స్ ఇంటర్నేషనల్ హనుమకొండ లయన్స్ క్లబ్ కు అనుబంధంగా కొత్తగా ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ ఆఫ్ ద్వారక నూతన శాఖ పదాధికారుల బాధ్యతల స్వీకార కార్యక్రమం హనుమకొండ శాయంపేటలోని లయన్స్ క్లబ్ హాల్ లో ఘనంగా జరిగింది. హాజరైన సభ్యుల సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకొని వారిచే లయన్ డిజి డాక్టర్ నరహరి సుధాకర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా లయన్ డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో ద్వారక క్లబ్ కు ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు క్లబ్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. లయన్ డిజి డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ద్వారక శాఖను అందరి సహకారంతో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. సహకారం అందించిన లయన్ డాక్టర్ వలబోజు మోహన్ రావు,విస్తరణ చైర్మన్ లయన్ చల్లా రఘునాథ రెడ్డి,లయన్ ప్రవీణ్,లయన్ ప్రకాష్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా లయన్ విష్ణువర్ధన్ ను పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్వారక లయన్ క్లబ్ అధ్యక్షులు లయన్ గర్రెపల్లి మణికంఠ, కార్యదర్శి లయన్ చిరగోని అభిలాష్, కోశాధికారి లయన్ మంతెన నిఖిల్ తో పాటు పలువురు లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజలు మెచ్చేలా గ్రామాభివృద్ధికీ కృషి

**ప్రజాపక్షం /నడికూడ :** గ్రామ ప్రజలు మెచ్చేల అభివృద్ధికీ కృషి చేస్తానని వెంకటేశ్వర్లపల్లి సర్పంచ్ పెండ్యాల మహేందర్ రెడ్డి అన్నారు. నడికూడ మండల పరిధిలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి 10 లక్షల రూపాయలు మంజూరు చేశారు.ఈ సందర్భంగాఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ ను ప్రారంభించిన గ్రామ సర్పంచ్ పెండ్యాల మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సిసి రోడ్లు గ్రామాభివృద్ధికి దోహదపడతాయని, ఈ పనులను నాణ్యతతో పూర్తిగా చేస్తున్నామని గ్రామ ప్రజలు మెచ్చేలా గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు,గ్రామ కార్యదర్శి మౌనిక,పాలకవర్గం, కాంట్రాక్టర్ తిరుపతి రెడ్డి, కారోబార్ రవీందర్ పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా సాగు విధానాలు మార్చుకోవాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/కొడకండ్ల:** ప్రస్తుతం ఉన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో ఆరుతడి పంటలను రైతులు పండించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మండలంలోని మొండ్రాయి గ్రామంలో కొమ్ము మహేందర్ కూరగాయల క్షేత్రాన్ని కలెక్టర్ సోమవారం సందర్శించి కూరగాయల పంటల సాగు తీరును పరిశీలించారు. రైతు తనకున్న రెండున్నర ఎకరాల సాగు విస్తీర్ణంలో ఎకరంలో 10 గుంటలు దోసకాయ సాగు, పది గుంటలలో బెండకాయ 10 గుంటలు, చిక్కుడు సాగుచేస్తున్నారు. అంతేగాకుండా ఎఇంకో ఎకరంలో పచ్చిమిర్చి, టమాటా నారు సిద్ధం చేసుకుని పంట వేయడానికి నేలను తయారు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మొండ్రాయి గ్రామం, చుట్టు పక్కల తండాలకు చెందినటువంటి రైతులతో మాట్లాడుతూ వరి పంట, కూరగాయల పంటల సాగులో లాభాల తీరును అడిగి తెలుసుకున్నారు. వరి పంట కంటే కూరగాయల సాగు వల్లే లాభాలు బాగా వస్తున్నాయని కూరగాయల సాగు వల్ల ప్రతి రోజు ఆదాయం ఉంటుందన్నారు. కలెక్టర్ వారికి తక్కువ నీటి అవసరాలతో చేతికొచ్చే ప్రత్యామ్నాయ మెట్ట పంటల వైపు దృష్టి సారించాలన్నారు.

## పోచన్నపేట వాగులో ఇసుక అక్రమ రవాణా

ప్రజాపక్షం/బచ్చన్నపేట: జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేట వాగులో రాత్రి వేళల్లో అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతోందని గ్రామస్థులు ఆరోపించారు. ట్రాక్టర్లు, టిప్పర్లతో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండడంతో భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారులు దెబ్బతినడంతో పాటు శబ్ద కాలుష్యంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అక్రమ రవాణాపై తక్షణ చర్యలు తీసుకుని, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త ఇంజ మనోహర్, గ్రామస్థులు డిమాండ్ చేశారు.

## 22న తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనలు

ప్రజాపక్షం/జఫర్‌గఢ్: జూలై 22న తహశీల్దార్ కార్యాలయం ఎదుట జరిగే నిరసనలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య పిలుపునిచ్చారు. సోమవారం అఖిలభారత రైతు సభ జాతీయ కమిటీ పిలుపుమేరకు భారతీయ రైతుల ప్రయోజనాలు, దేశ సార్వభౌమాధికారాన్ని పరిరక్షించాలని కోరుతూ అమెరికా, భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కూనూర్ గ్రామంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సోమయ్య మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలు, దేశ ఆహార భద్రత, ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థలకు విఘాతం కలిగించే విధంగా ఉండే ఎలాంటి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలనైనా కేంద్ర ప్రభుత్వం పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు రాయపురం బిక్షపతి, కనకయ్య, రాజు, సారయ్య, ప్రవీణ్, యాదగిరి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసిన టీఆర్పి జిల్లా అధ్యక్షుడు

ప్రజాపక్షం/రఘునాథపల్లి : తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు,తెలంగాణ ముదిరాజ్ మహాసభ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల సదానందం సోమవారం ఎస్సై దూదిమెట్ల నరేష్ యాదవ్ ను స్థానిక పోలీస్ స్టేషన్లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కొద్ది సేపు వారు చర్చించారు. సదానందం ఇంకా మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఎస్ఐ ఆకాంక్షించారు.

## ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలి: కలెక్టర్

ప్రజాపక్షం/కొడకండ్ల: నకిలీ ఎరువులను కాకుండా నాణ్యమైన ఉత్పత్తులను మాత్రే విక్రయించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం కొడకండ్ల మండలంలోని గిర్నితండాలో గల శ్రీఅభయ్ ఫర్టిలైజర్ షాప్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాప్ లైసెన్స్ పత్రాలను, కొనుగోలు రిజిస్టర్ పరిశీఇంచారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ పాస్ యంత్రంలో నమోదైన కొనుగోలు వివరాలు, ప్రస్తుతం నిల్వ గల యూరియా బస్తాల సంఖ్యలో ఉన్న తేడాని కలెక్టర్ గమనించి దీనికి సంబంధించిన వివరా ఇవ్వాలని మండల వ్యవసాయాధికారిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎరువుల అందుబాటులోవ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలన్నారు.

## వరుణ దేవుడా కరుణించవా శివాలయంలో జలాభిషేకం



ప్రజాపక్షం/లింగాలఘణపురం: వరుణ దేవుడా కరుణించవా అంటూ మండల కేంద్రంలో సర్పంచ్ ఎల్ల లావణ్య రాజు ఆధ్వర్యంలో, గ్రామ ప్రజలు మహిళలు, సోమవారం నీటి బిందెలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి, గ్రామ బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేసి అనంతరం, మహిళలు గ్రామ ప్రజలు ర్యాలీగా వెళ్లుతు శ్రీ వీరాంజనేయ దేవాలయంలోని శివాలయంలో అర్చకులు అవ్వారు ఉమా నాథ్ శర్మ ఆధ్వర్యంలో, శివునికి క్షీరాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు నీటి బిందెలతో స్వామి వారిపై జలాలను పోసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సర్పంచ్ ఎల్లా లావణ్య రాజు మాట్లాడుతూ గత కొద్ది రోజుల నుండి వర్షాలు కురువక రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, రైతులు వ్యవసాయ బావి వద్ద నార్లు పోసిన ఎండిపోయాయని, తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాను అన్నారు. వర్షాలు కురవడం వల్ల, రైతులు పాడి పంటలతో సుఖ సంతోషాలతో జీవిస్తారని గ్రామ ప్రజలకు అనౌన్స్ నష్టం జరగకుండా కలుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో, గ్రామ ప్రజలు రేవూరి శ్రీనివాస్ ఏదునూరి వీరన్న, సలేంద్రి చారి, కోడి తాల సంపత్ కుమార్, కోడితాల శేఖర్ కుమార్, బిట్ల అంజనేయులు, బంద్రు సత్తయ్య, జాగిల్ల పురం కుమార్ (కుల పెద్దమనిషి)గట్ల గల్ల నరసింహ, ఉప్పలయ్య పోరెడ్డి, ఏలేందర్ రెడ్డి, మహిళలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అధికార పార్టీ కౌన్సిలర్లు ఉన్న వార్డుల్లోనే ఇందిరమ్మ ఇండ్లు




ప్రజాపక్షం/భూపాలపల్లి : బిఆర్ఎస్ పార్టీ గెలిచిన కౌన్సిలర్ల వార్డులలో ఇందిరమ్మ ఇండ్లు రావడంలేదని, అధికార పార్టీ వార్డుల్లోనే ఇందిరమ్మ ఇండ్లను ఇస్తున్నారని బిఆర్ ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్,కౌన్సిల్ లర్ గండ్ర హరీష్ రెడ్డి, 11వ వార్డ్ కౌన్సిలర్ మోతె రాజు సూటిగా ప్రశ్నించారు. సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, మున్సిపల్ సమావేశం వెంటనే ఏర్పాటు చేయాలి వార్డులోని భూపాలపల్లి మున్సిపాలిటీలో గ్రామ గెలిచిన తర్వాత ఒక్కసారి మాత్రమే మున్సిపల్ జనరల్ బాడీ మీటింగ్ పెట్టారని, ఇప్పటివరకు ఒక్క మీటింగ్ కూడా పెట్టకుండా మున్సిపల్ అధికారులు ఇష్ట రీతిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మున్సిపాలిటి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మున్సిపాలిటీలో సైతం తన మాటే సాగాలని తూతూ మంత్రంగా గత మున్సిపల్ సమావేశాన్ని నిర్వహించి వెళ్లిపోయారన్నారు. గత మున్సిపల్ సమావేశాన్ని వాళ్ళ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లే బహిష్కరించి, వెళ్లిపోయారన్నారు.మున్సిపల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి వార్డుల్లో సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు పట్టింపు లేనట్లుగా వ్యవహరించడంతో ఎండాకాలంలో మున్సిపల్ అధికారులు దగ్గరుండి తమ తమ వార్డుల్లోని సమస్యలను పరిష్కరించుకున్నారన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కాలనీలో సమస్యల పరిష్కారానికి వెంటనే భూపాలపల్లి మున్సిపాలిటీ సర్వే సభ్య సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రతి ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి




ప్రజాపక్షం/గోవిందరావుపేట: డీజీపీ ఆదేశాల మేరకు ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకేవన్ ఐపీఎస్ జూచనలతో ములుగు డీఎస్పీ రవీందర్ పర్యవేక్షణలో పసర సీఐ దయాకర్ ఎస్ఐ తాజుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేను సైతం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా దుంపెల్లిగూడెం గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కార్యక్రమాన్ని నిర్వహించారు గ్రామ సర్పంచ్ సీతారం వార్డు సభ్యులు సహకారంతో గ్రామంలో 9 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా పసరకు చెందిన సంపత్ రెడ్డి తన నివాసంలో 3 సీసీ కెమెరాలు చల్వాయి గ్రామానికి చెందిన దుకాణదారుడు నర్సయ్య తన షాపు వద్ద మరో 3 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు మొత్తంగా 15 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ నేరాల నియంత్రణతో పాటు ప్రజల ప్రాణ ఆస్తి రక్షణలో సీసీ కెమెరాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అని పేర్కొంటూ ప్రతి గ్రామంలో ప్రతి వీధిలో ప్రతి ఇంటికి ప్రతి వ్యాపార సంస్థలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు సీసీ కెమెరాల ద్వారా నేరాలనే సమర్థవంతంగా అరికట్టడంతో పాటు ఘటనలపై వేగంగా దర్యాప్తు చేపట్టేందుకు నిందుతులను గుర్తించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని పోలీసులు వివరించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

ప్రజాపక్షం/భూపాలపల్లి: పార్టీ అప్పగించిన బాధ్యతలను ప్రతి ఇంచార్జి అంకితభావంతో నిర్వహించా లని, ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న సర్ ప్రక్రియలో భాగంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులకు పట్టణంలోని వివిధ బూత్‌లకు ఇన్‌చార్జీలుగా బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయా బూత్ లలో ఇన్‌చార్జీలు నిర్వహిస్తున్న పనితీరును జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కరుణాకర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్యతో కలిసి పలువురు బూత్‌లను సందర్శించి, ఇంటింటికీ వెళ్లి చేపడుతున్న సర్వే, ఫారాల సేకరణ, ప్రజలకు అందిస్తున్న అవగాహన కార్యక్రమాలను పరిశీలించారు. బూత్ ఇన్‌చార్జీలతో మాట్లాడి, ఎదురవుతున్న సమస్యలను తెలుసుకొని, ప్రక్రియను మరింత వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బట్టు కరుణాకర్ మాట్లాడుతూ, పార్టీ అప్పగించిన బాధ్యతలను ప్రతి ఇన్‌చార్జి అంకిత భావంతో నిర్వహించాలని, ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ, ప్రతి ఇన్‌చార్జి సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఆదర్శంగా నిలపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరం పరిష్కరించాలి



ప్రజాపక్షం/ సిద్దిపేట : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను సత్వరం పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యలను,వినతులను జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్‌తోకలిసి కలెక్టర్ స్వీకరించారు. ఈసందర్భంగాకలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చేసి అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించేదిశగా అధికారులు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, ట్రైనీ కలెక్టర్ భవ్య, ఎస్‌డిసి సుదర్శన్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలి

ప్రజాపక్షం/భూపాలపల్లి : ప్రజలు ఎలాంటి పైరవీలు లేదా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్ సూచించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్, ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన 13 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేదా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతి భద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రజలకు సత్వర, పారదర్శకమైన సేవలు అందించేందుకు భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

## వైభవంగా శ్రీజగన్నాథ స్వామి రథయాత్ర

ప్రజాపక్షం/జనగామ టౌన్: హరేకృష్ణ హరే రామ భక్త బృందం, గీతాశ్రమం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర జనగామ పట్టణంలో భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. బస్టాండ్ చౌరస్తా నుండి ప్రారంభమైన రథయాత్రను డీసీపీ రాజమహేంద్ర నాయక్ తాడు లాగి ప్రారంభించారు. పట్టణ వీధుల గుండా సాగిన యాత్రలో భక్తులు హరినామ సంకీర్తనలు చేస్తూ పాల్గొన్నారు. అనంతరం రైల్వే స్టేషన్ వద్ద భక్తులకు మహాప్రసాదం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

ప్రజాపక్షం/పాలకుర్తి: మండలంలోని శాతాపురం గ్రామానికి చెందిన అనిత విద్యుత్ షాక్‌తో మృతిచెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రాగిరి అనిత (38) బట్టలు దండెంపై ఆరేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందినట్లు చెప్పారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## పిహెచ్‌సి స్థలాన్ని పరిశీలించిన డిఇ

ప్రజాపక్షం/తరిగొప్పుల: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించబోయే పిహెచ్‌సి ఖాళీ స్థలాన్ని డీఈ రవీందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యతతో కూడిన పనులు తొందరగా పూర్తి చేయాలని నాసిరకంతో పనులు పూర్తి చేస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని కాంట్రాక్టర్ తెలిపారు. అన్ని హంగులతో తొందరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పలు సూచనలు చేశారు. ప్రతి పనిని ఆడిట్ చేయాలని ఏఈకి సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, వార్డు మెంబర్ వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉక, కుమార్, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి హెల్ప్ డెస్క్ కు వినతుల వెల్లువ



## సమస్యలపై ప్రజల నుండి 85 దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ కలెక్టరేట్ లోని హెల్ప్ డెస్క్ ద్వారా వివిధ సమస్యలపై ప్రజల నుండి ప్రజావాణి దరఖాస్తులను సిబ్బంది స్వీకరించారు. సోమవారం ఉమ్మడి జిల్లా ఎల్‌నినో ప్రభావం మంత్రి వివేక్ సమావేశానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఇతర శాఖల అధికారులు సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లిన సందర్భంగా అధికారులు అందుబాటులో లేకపోవడం వల్ల హెల్ప్ డెస్క్ ద్వారా సంబంధిత సిబ్బంది ప్రజావాణి నిర్వహించి ప్రజలు వద్ద నుండి 85 దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు పంపించడం జరుగుతుందని సమస్యలు పరిష్కార దిశగా కృషి చేస్తున్నాట్లు హెల్ప్ డెస్క్ సిబ్బంది తెలిపారు.

# ‘సర్’ కార్యక్రమాన్ని పరిశీలించిన మహిళా నాయకులు

**ప్రజాపక్షం/మహాదేవపూర్:** జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని మండల మహిళా కాంగ్రేస్ నాయకులు సోమవారం పరిశీలించారు.రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు ఆదేశాల మేరకు కుంభం స్వప్న రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు మండలంలోని బ్రాహ్మణపల్లి,ఎడపల్లి ,కుదురుపల్లి గ్రామాలలో ఓటర్ల నమోదు ప్రక్రియను పర్యవేక్షించి తగు సలహాలు,సూచనలు చేసారు.గ్రామాల్లో 90 శాతం పైగా నమోదు కార్యక్రమం జరగగా కుదురుపల్లి 173 బూతులో ఓటు నమోదు ప్రక్రియ వంద శాతం పూర్తి చేసారని దీనికి కృషి చేసిన సర్పంచ్ చల్ల సమ్మి రెడ్డి,బిఎల్‌వో కోట సమ్మయ్య,బిఎల్‌ఓ కుమ్మరి సారయ్య,కారోబార్ జిముడ రాజబాబు లను శాలువాతో సత్కరించి సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాటారం మార్కెట్ కమిటీ చైర్మెన్ పంతకాని తిరుమల సమ్మయ్య,సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్,మాజీ ఎంపిపి రాణీ బాయి రామారావు,బందెల సత్యమ్మ,రాష్ట్ర మహిళా కాంగ్రేస్ ఉపాధ్యక్షురాలు ఆంగోత్ సుగుణ,కాళేశ్వరం దేవస్థాన ధర్మకర్త పద్మ,మాజీ చైర్మెన్ వామన్ రావు,సర్పంచ్‌లు మోతె నీలా రాణి సాంబయ్య,మాజీ ఎంపిటిసి గంగయ్య,తదితరులు పాల్గొన్నారు.

# పోడు భూముల బాధితులపై ప్రభుత్వం చేసిన దాడి




**ప్రజాపక్షం/ నర్సంపేట :** అశ్వాపురం మండలం మనుబోతులపాడు గ్రామపంచాయతీ వేములూరుపాడు భూమి బాధితులపై ఫారెస్ట్ అధికారులు చేసిన విచక్షణ రైతుల దాడులను ఖండిస్తున్నామని అఖిల భారత రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కుల తిరుపతి అన్నారు. నర్సంపేటలోని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశం గట్టి కృష్ణ అధ్యక్షన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాతల ముత్తాతల నుండి సాగు చేసుకుంటున్న భూమిలోకి వెళ్లి విత్తనాలు నాటుతున్న సమయంలో జెసిబిలను తీసుకొచ్చి ట్రెంచ్‌లు వేస్తున్న సమయంలో అడ్డుకోవడానికి వెళ్ళిన మహిళలపై ఫారెస్ట్ అధికారులు మహిళలని చూడకుండా విచక్షణ రహితంగా దాడి చేశారన్నారు. దీనితో మహిళలు మడకం గంగమ్మ, సలవం జ్యోతి, మడకం సీతమ్మ, సోడి సాయమ్మ, కణితి సారమ్మ, పూణెం రామలక్ష్మి అనే మహిళలు తీవ్రంగా గాయపడి లేచే పరిస్థితి లేదన్నారు. తాతల, ముత్తాతల నుండి భూమిని నమ్ముకొని బ్రతుకుతున్న ఆదివాసీలకు ప్రభుత్వం కల్పించిన పిసా యాక్టివ్, అటవీ హక్కుల చట్టం, 1/70 యాక్ట్ లాంటి చట్టాలు కాగితాలకే పరిమితమైన తప్పితే ఆచరణలో ఎక్కడ లేవని వారు అన్నారు. ఇంత విచక్షణ రహితంగా ఆడ, మగ తేడా లేకుండా దాడి చేసిన ఫారెస్ట్ అధికారుల వీడియోలు మొత్తం సోషల్ మీడియాలో వస్తున్న పక్కనే ఉన్నటువంటి ఐటిడిఏ ఆఫీసు అధికారులు, పీఓ స్పందించకపోవడం ఆదివాసులను ఆదుకోకపోవడమేనన్నారు. భూమి కోసం కొట్లాడి పోరాటంలో గాయపడిన మహిళలని ధైర్య పరుస్తూనే ఈ విషయంపై మానవ హక్కుల చట్టానికి సుప్రీంకోర్టుకు, హైకోర్టుకు, హ్యూమన్ రైట్స్ నీ కలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతుకుల సంఘం భద్రాజి, లక్ష్మక్క, సారయ్య, ప్రదీప్, ఇట్టబోయిన రవి, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

# అరుణోదయ నాగన్న సంతాప సభను జయప్రదం చేయాలి



**ప్రజాపక్షం/ వరంగల్ :** ఈనెల 25వ తేదీన హైదరాబాదులో జరుగు అరుణోదయ నాగన్న సంతాప సభను జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు అన్నారు. వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ప్రజాసంఘాల నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ నాగన్న సంతాప సభ ఈనెల 25వ తేదీన హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు వేణు అధ్యక్షత వహిస్తారని, ప్రముఖ కవి సతీష్ చందర్, సినీ నటులు ఆర్ నారాయణమూర్తి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి జె.వి చలపతిరావు, నాయకులు ఆవునూరి మధు, ప్రొఫెసర్ వినయ్ బాబు తదితరులు ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, ఐఎఫ్‌టియు నగర కార్యదర్శి బన్ననర్సింగం, పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు గంద్రాతి హరిబాబు, పిడిఎస్‌యు వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మద్రి మహేష్, మన్నే కరుణాకర్, బండి వెంకటేశ్వర్లు, చంద్రమౌళి, ఇనుముల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ చెస్ డే



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** చెస్ క్రీడ మానసిక వికాసానికి, ఏకాగ్రత, మేధోసంపత్తి పెంపొందించుకోవడానికి, నిర్ణయ సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవడానికి, స్నేహ భావం, ఐక్యతను పెంపొందించడానికి ఎంతో దోహదపడుతుందని జిల్లా చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్,గౌరవాధ్యక్షులు పంతకాని సమ్మయ్య లు తెలిపారు. అంతర్జాతీయ చెస్ డే సందర్భంగా జిల్లా చెస్ అసోసియేషన్ వేడుకలు నిర్వహించి చెస్ ఆడిన జిల్లా చెస్ అసోసియేషన్ సభ్యులు అంతర్జాతీయ చెస్ డే సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో చెస్ ప్రాముఖ్యతను గూర్చి ఘనంగా వివరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్, పంతకాని సమ్మయ్య మాట్లాడారు. విద్యార్థులు, యువత చెస్ క్రీడను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే అసోసియేషన్ జిల్లా నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కమిటీ సభ్యులు అసిఫ్, రాం నారాయణ, సుమన్, దేవేందర్, శ్రీరాములు, కిరణ్, సంతోష్, శంకరయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# నవీన్ నాయక్‌పై దాడి చేసిన వారిపై అట్రాసిటి కేసు నమోదు చేయాలి



**ప్రజాపక్షం/ నర్సంపేట :** నవీన్ నాయక్‌పై దాడి చేసిన వ్యక్తులపై అట్రాసిటి కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని గోర్ సభ జాతీయ అధ్యక్షులు జయసింగ్ రాథోడ్ అన్నారు. నర్సంపేట 16వ డివిజన్ కౌన్సిలర్ బానోత్ నవీన్ నాయక్ పై జరిగిన దాడి ఘటనపై గిరిజన మేధావుల ఫోరం, లంబాడ హక్కుల పోరాట సమితి, ఎరుకుల ఐక్యవేదిక, గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు నిజనిర్ధారణ కోసం ఘటనాస్థలాన్ని సందర్శించి, అనంతరం బానోత్ నవీన్ నాయక్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా నిజనిర్ధారణ కమిటీ సభ్యులు జరిగిన ఘటనపై నవీన్ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బానోత్ నవీన్ నాయక్‌పై జరిగిన దాడిని తెలంగాణలోని లంబాడి సమాజంపై జరిగిన దాడిగా భావించాలన్నారు. నర్సంపేట నియోజకవర్గంలోని మాదన్నపేట చెరువు ప్రాంతంలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై ప్రశ్నించినందుకే నవీన్ నాయక్‌పై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. నవీన్ నాయక్‌పై జరిగిన ఈ దాడి మొదటిదీ కాదు, చివరిదీ కాదు. గతంలో కూడా ఇలాంటి దాడులు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు, కోమాలోకి వెళ్లిన సంఘటనలు, భయభ్రాంతులకు గురైన ఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. అందువల్ల సంబంధిత శాఖలు వెంటనే స్పందించి, బానోత్ నవీన్ నాయక్‌పై హత్యాయత్నానికి పాల్పడిన దుండగులను తక్షణమే అరెస్టు చేసి, ఎస్సి,ఎస్టి, అట్రాసిటి చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ అట్రాసిటీ కేసు నమోదు చేయకపోతే, వేలాది మంది గిరిజనులతో కలిసి ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించి, సంబంధిత అధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ డెమోక్రటిక్ ఫ్రంట్ జాతీయ నాయకులు పోరిక ఉదయ్ సింగ్ నాయక్, లంబాడ హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి సమ్మయ్య రాథోడ్, ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి లాకావత్ కరుణాకర్ నాయక్, ఎరుకుల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు పాలకుర్తి పాపయ్య, ఉపాధ్యాయ సంఘ నాయకులు భద్రయ్య, రూప్ సింగ్, సమ్ము నాయక్ పాల్గొన్నారు.

# ఆదివాసీల హక్కులకు భంగం కలిగించొద్దని హెచ్చరిక



**ప్రజాపక్షం/వాజేడు:** ఏజెన్సీ ప్రాంతాల్లో పెసా గ్రామసభ తీర్మానాలను ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాలని ఆదివాసీ నవనిర్మాణ సేన జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్, మండల అధ్యక్షుడు మోడెం నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం ములుగు జిల్లా కలెక్టర్‌కు వాజేడు, వెంకటాపురం మండలాల్లో అంగన్వాడీ నియామకాల విషయంలో ఆదివాసీలకు అన్యాయం జరిగిందని తెలిపారు. సంబంధిత గ్రామసభలు ఏకగ్రీవంగా చేసిన పెసా తీర్మానాలను ప్రభుత్వం గౌరవించి అమలు చేయాలని కోరారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో రాజ్యాంగం కల్పించిన హక్కులను అధికారులు, రాజకీయ పార్టీలు పరిరక్షించాలని, ఆదివాసీల స్వయం నిర్ణయాధికారాన్ని గౌరవించాలని అన్నారు. అలాగే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల్లో పనిచేస్తున్న ఎస్టీ సెల్ నాయకులు ఆదివాసీల హక్కుల పరిరక్షణకు బహిరంగంగా స్పందించాలని, అవసరమైతే ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాజేడు, వెంకటాపురం మండలాలకు చెందిన ఆదివాసీలు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రాథమిక అభ్యాస నైపుణ్యాల పెంపే లక్ష్యం

**ప్రజాపక్షం/వాజేడు:** ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలోని వాజేడు నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక విద్యార్థుల్లో భాషా, గణిత నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు సోమవారం టీచర్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి తేజావత్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు భాషా, గణిత సామర్థ్యాల్లో వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఆ లోటును అధిగమించేందుకు ఈ విద్యా సంవత్సరంలో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు 60 నిమిషాల పాటు రెమిడియల్ తరగతులు నిర్వహించాలని సూచించారు. వారంలో రెండు రోజులు తెలుగు, రెండు రోజులు ఇంగ్లీష్, రెండు రోజులు గణితం బోధించేలా ప్రణాళిక రూపొందించాలని ఉపాధ్యాయులకు వివరించారు. అదే విధంగా ప్రతి రోజు 30 నిమిషాల పాటు విద్యార్థులతో లైబ్రరీ పుస్తకాలు చదివించి పఠన అలవాటు పెంపొందించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో హెచ్‌ఎం సోయం ఆనందరావు, ప్యానెల్ టీమ్ సభ్యుడు బి.జయేందర్ రావు, పి.జానకరావు, పూనెం రమేష్, కరుటూరి సతీష్ కుమార్, దాసుల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# 31 లోపు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

## వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రాజ్

**ప్రజాపక్షం/పాపన్నపేట:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ‘రైతు భరోసా’ పథకం కింద జులై 31వ తేదీ రేపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రాజ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త దరఖాస్తులు, బ్యాంకు ఖాతా వివరాల సవరణ కోసం ఈ నెల 31వ తేదీ వరకు మరో అవకాశం కల్పించిందన్నారు. 2026 జూన్ 15వ తేదీ వరకు కొత్త భూ పట్టా పాసుబుక్ పొందిన రైతులు, అలాగే ఇప్పటి వరకు భూ పట్టా పాసుబుక్ ఉన్నప్పటికీ రైతు భరోసా పథకం ప్రయోజనం పొందని అర్హులైన రైతులు తమ బ్యాంకు వివరాలను నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. దరఖాస్తు చేసుకునే రైతులు రైతు భరోసా దరఖాస్తు ఫారం, భూ పట్టా పాసుబుక్ ( పిపిబి) కాపీ, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ లేదా క్యాన్సిల్ చెక్, మొబైల్ నంబర్‌తో పాటు సంబంధిత రైతు వేదిక లోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) ను సంప్రదించాలని సూచించారు. అర్హులైన ప్రతి రైతు అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలన్నారు

## రూ.2.24 లక్షల విలువగల సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/కొల్చారం: కొల్చారం మండలానికి ఐదు గ్రామాలకు ఏడుగురు లబ్ధిదారులకు రెండు లక్షల 24 వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను నేడు కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో ఇట్టి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కృషి చేసిన నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి చేతుల మీదుగా నర్సాపూర్లో మేడి లబ్ధిదారులకు చెక్కులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్ మాట్లాడుతూ, ప్రజల కోసం పనిచేస్తున్న నరసాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి కి ప్రచారం మండల కాంగ్రెస్ పార్టీ తరపున, సీఎంఆర్ లబ్ధిదారుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపడం జరిగింది.

## మృతుల కుటుంబాలకు పరామర్శి చాడ

ప్రజాపక్షం / హుస్నాబాద్ : హుస్నాబాద్ మండల కేంద్రమంలో ఇటీవల ప్రమాదవశత్తులో ఇంట్లో జారి పడి బ్రేన్ స్ట్రోక్‌తో చనిపోయిన రామక మహేశ్వరి కుటుంబ సభ్యులను సిపిఐ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పరామర్శించి జరిగిన ప్రమాదంపై వివరాలు అడిగితెలుసుకుని తమ ప్రగాఢ సానుబూతిని ఆమె చిత్రపఠంపై పూల గుచ్ఛం ఉంచినివా ళ్ళ అర్పించి ఆమె ఆత్మకు శాంతి చేకురాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి గడిపె మల్లేశ్, సిపిఐ నాయకుడు నియోజకవర్గ కన్వీనర్ జాగీరు సత్యనారయణ, విద్యార్థి సంఘం అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్, మహిళ సమాఖ్యాజిల్లా అధ్యక్షురాలు పద్మ,లు పాల్గొన్నారు.

## రోడ్డుపై కేజీవీల్స్ నడిపితే కఠిన చర్యలు

ప్రజాపక్షం/శివ్వంపేట : ట్రాక్టర్ యజమానులు రోడ్డుపై కేజీవీల్స్ నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మధుకర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రైతులు, ట్రాక్టర్ యజమానులతో కలసి మాట్లాడారు. ట్రాక్టర్ యజమానులు పొలాల్లోకి కేజీవీల్స్ తీసుకెళ్లేటప్పుడు రోడ్డుపై కాకుండా ట్రాలీ ద్వారా తరలించాలని అన్నారు. రోడ్లపై కేజీవీల్స్ నడిపితే వాటిని సీజ్ చేయడంతో పాటు ప్రభుత్వ ఆస్తి ధ్వంసం కింద కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు , జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

## బెల్ట్ దుకాణాలపై పోలీసుల దాడులు

ప్రజాపక్షం/రామాయంపేట: గ్రామాల్లో బెల్ట్ దుఖాణాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు సాగిస్తున్న వారిపై రామాయంపేట పోలీసులు దాడులు చేశారు. ఆదివారం మండల పరిధిలోని దంతెపల్లి గ్రామంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టిన ఎస్ఐ బాల్‌రాజు బెల్ట్ దుఖాణం నిర్వహిస్తున్న వారి నుండి 22లీటర్ల మద్యాన్ని స్వాదీనం చేసుకొని మద్యం విక్రయిస్తున్న లేకుండా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మద్యానికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టండి

### వర్గల్ మండల వ్యవసాయాధికారి శేషశయన



ప్రజాపక్షం / గజ్వేల్: ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని వ్యవసాయాధికారి శేషశయన స్పష్టం చేశారు. సోమవారం శేరిపల్లిలో సర్పంచ్ ఎర్ర పావని అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎల్‌నినో కారణంగా భూగర్భ జలాలు తగ్గి వర్షపాతం అతి తక్కువ నమోదై బోర్లు అడుగంటి పోయినట్లు తెలిపారు. అలాగే కాల్వలు కరిగి పోవడంతో చెరువులు, కుంటలు నిండే పరిస్థితి లేదని చెప్పారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని రైతులు వరి సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలు ఎంచుకోవాలని కోరారు. అయితే తక్కువ నీటితో సాగయ్యే పొద్దు తిరుగుడు, జొన్న, పెసలు, మినుములు, కంది, నువ్వులు, సజ్జలు తదితర పంటలు సాగు చేసుకోవాలని అన్నారు. రాబోయే రోజుల్లో బోర్లు, చెరువుల ద్వారా నీటి లభ్యత మరింత తగ్గే అవకాశం ఉన్నందున నీటిని ఆదా చేస్తూ సాగుపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 6950 ఎకరాల్లో మొక్కజొన్న, స్వీట్‌కార్న్, పత్తి, కూరగాయలు తదితర పంటలు సాగు చేసినట్లు తెలిపారు. ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు, వర్షాభావం, నిరంతర డ్రై స్పెల్ కారణంగా పంటలు తేమ ఒత్తిడికి గురికానుండగా, మొక్కలు భూమి నుండి నీరు, పోషకాలను గ్రహించే సామర్థం తగ్గుతుందని, దీనిని అధిగమించడానికి ఎరువులు పిచికారీ చేయడం అవసరమని అన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ సాగు చేసుకోవాలని, తద్వారా అధిక దిగుబడులు పొందాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం బీరయ్య, ఎంపీడీఓ సురేష్, ఏఈఓ సునీత, పంచాయతీ కార్యదర్శి భాగ్య తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ నీటితో పండే పంటలను వేసుకోవాలి

### రైతు వేదికలో అవగాహన సమావేశం
### వ్యవసాయ అధికారి గోవిందరాజు



ప్రజాపక్షం/కొండపాక: కుకునూరుపల్లిమండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎండి.మహబూబ్ అలీ ఆధ్వర్యంలో కుకునూరుపల్లి రైతు వేదికలో మండల సర్పంచులు, గ్రామస్థాయి అధికారులతో ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు ఎల్‌నినో ప్రభావంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి గోవిందరాజులు మాట్లాడుతూ తక్కువ నీటితో సాగు చేయగల జొన్న, సజ్జ, రాగులు, నువ్వులు, ఆముదం, అపరాలు వంటి పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలని సూచించారు. ఉద్యానవన శాఖ అధికారి కౌసల్య కూరగాయలు, ఆయిల్‌పామ్ తోటల విస్తరణపై అవగాహన కల్పించారు. మండల పంచాయతీ అధికారి నాగభూషణం గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, పారిశుద్యంపై వివరించగా, టెక్నికల్ అసిస్టెంట్లు ఉపాధి హామీ పథకం ద్వారా ఫార్మ్‌పాండ్లు, ఇంకుడు గుంతలు తవ్వించుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ ఏఈ తిరుమల్ రెడ్డి తాగునీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. వైద్యాధికారి డా॥ అఖిల సీజనల్ వ్యాధుల నివారణ, దోమల నియంత్రణ చర్యలపై సూచనలు ఇవ్వగా, మండల విద్యాశాఖ అధికారి బి.సత్తయ్య బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్ అలీ, ఏఈఈ పీఆర్ ఆదర్శ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఆకుల భద్రప్ప, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు, మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వాతావరణనికి అనుకులంగా వ్యవసాయం పంటలు

### వ్యవసాయం పై రైతులకు వరహ ఎగ్ ప్రయివేటు నిపునుల సూచనలు

ప్రజాపక్షం / హుస్నాబాద్ : నేడు ఎలినోవ ప్రభావంతో వాతావరణంలో ఏర్పాడిన కారణల వల్ల వర్షలు లేక పోవడంతో అధిక నీటితో సాగు చేసే పంటలను కాకుండ తక్కువ నీటితో పండే పంటలను సాగు చేసుకోవాలని వరహ క్లైమేట్ ఎగ్ ప్రయివేటు లిమిటేడ్ రాష్ట్ర ఇన్‌చార్జీలు పల్లె వెంకటేశ్‌గౌడు, దేవాన్,హుస్నాబాద్ ఫీల్డు కో ఆర్డినేటర్ ఇసాక్‌లు రైతులకు సూచించారు. సోమవారం హుస్నాబాద్ మండల మాలపల్లె గ్రామ సర్పంచు వెన్న స్వర్ణలత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెన్న రాజుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణ మార్పుల ప్రభావంతో వ్యవసాయ రంగం ఎన్నో కష్టలను ఎదుర్కోంటుందని వాటికి అనుగుణంగా ఆధునిక పర్యావరణ హిత సాగు విధానాలను అవలంబించడం వల్ల నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు నీటి వినియోగం తగ్గించి సాగు ఖర్చులు కూడ నియంత్రించవచ్చని వారు తెలిపారు. రైతులకు స్థిరమైన సాగు పద్ధతులు , కార్బన్‌క్రెడిట్ లపై రైతులకు అవగాహపన కల్పించారు. వాతావరణం అనుగుణంగా సాగు పద్ధతులు పాటించడం వల్ల సారం పెరిగి రసాయన ఎరువులు వినియోగం క్రమంగా తగ్గుతుందని అన్నారు. పంట వ్యర్థ పదార్థలతో సారం పెరిగి నీటి సంరక్షణ వల్ల చెట్ల ఎదుగుదల వంటి పర్యావర్ణ హిత విధానలకు ఎంతో ఉపయోగం ఉంటుందని అన్నారు. అందు వల్ల రైతు వాతావరణంకు అనుకూలంగా పంటలు వేసుకుని అందులో అంతర్ పంటలను సాగు చేసుకొవడం వల్ల రైతులకు అధిక దిగుబడుల కాకుండ భూ సారం పెరిగి మంచి పంటలు పండుతాయని ప్రతి రైతు నేడు మార్కెట్లోకి వచ్చే నూతన వ్యవసాయ సాంకేతిక విధానాలను పరికరాలను వినియోగించు కొని అధిక దిగుబడులను పెంచు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు రైతులు పాల్గొన్నారు

# విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి

### సిద్దిపేట జిల్లా విద్యార్థి సంఘం ఆధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్

ప్రజాపక్షం / హుస్నాబాద్ : నేడు ఢీల్లిలో విద్యార్థులు తమ హక్కుల సాధన కోసం చేపట్టిన చలో పార్లమెంటు కార్యక్రమంలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీచార్జి చేసి నిర్బందించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నమని సిద్దిపేట జిల్లా విద్యార్థి సంఘం ఆధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హక్కులను కాపాడుకునేందుకు వారు చేపట్టిన చలో పార్లమెంటు కార్యక్రమంలో విద్యార్థులపై అమానుషంగా వ్యవహరించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో విద్యార్థుల జీవితాలతో నేటి కేంద్ర ప్రభుత్వం ఆడుకుంటుదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు జరిగిన సంఘటపై ప్రధాని తక్షణమే క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్ టి ఏ లో చోటు చేసుకున్న అవినీతి ,వరుస పరీక్షపత్రాల లీకేజీల కుంబకోణంలో దేశ వ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థులు తమ ఉజ్వల భవిషత్తును కోల్పోయారని అన్నారు. వరుస కుంబకోనాలతో పేపర్ లీకేజీతలో ఇప్పటికే 17 మంది విద్యార్థులు తమ ప్రాణాలు కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. దేశంలో విద్య వ్యవస్థ తీవ్రమైన సంక్షేమంలో నెడుతున్న విద్యశాఖ మంత్రిని ప్రధాని ఎందుకు కాపాడుతున్నారు విద్యార్థులకు తెలుపాలని డిమాండ్ చేశారు. దేశ భవిశ్యత్తులను కాపాడే విద్యార్థులను నేరస్తుల్లా చూడటం ఎంటని నిలదీశారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తు విద్యార్థులపై జరిగిన సంఘటనకు ప్రధాని క్షమాపన చెప్పి విద్యాశాఖ మంత్రిని వెంటనే తోలగించాలని డిమాండ్ చేశారు

## ఆర్.వెంకటాపూర్‌లో బోనాల పండుగపై సమావేశం

ప్రజాపక్షం/రామాయంపేట: ఆషాడ మాసం సందర్భంగా నిర్వహించే బోనాల పండుగ ఉత్సవాల సమావేశం సర్పంచు ఉమ సంజీవరెడ్డి అధ్వర్యంలో సోమవారం నవదుర్గా మాత ఆలయం వద్ద నిర్వహించారు. మండల పరిదిలోని ఆర్. వెంకటాపూర్ గ్రామస్థులు సమావేశమై పండుగను సాంప్రదాయబద్ధంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించేందుకు ఉత్సవాల తేదీలను ఖరారు చేశారు. జులై 31న అమ్మవారికి కుంకుమార్చనతో పాటు హోమం, ఆగస్టు 1న అమ్మవారి కళ్యాణ మహోత్సవం, పిలుపునిచ్చారు. భక్తులందరు అమ్మవారిని దర్శించుకొని ఆమె కృపకు పాత్రులు కావాలని కోరారు. ఉత్సవాలను శాంతియుతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు గ్రామస్థులు సహకరించాలన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన నాయకులు

ప్రజాపక్షం/రేగోడు : మండలం లో ప్యారారం గ్రామంలో సోమవారం రెకోడ్ టిపిసిసి మెంబర్ మున్నూరు కిషన్ ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించారు అనంతరం వారు మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం కోసం ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో ప్యారారం గ్రామ సర్పంచ్ నరసమ్మ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు గున్న సంగమేశ్వర్లు సంగారెడ్డి మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు

## రైతు భరోసాకు మరో అవకాశం

ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట్ : పెద్ద శంకరంపేట మండలంలోని రైతులకు రైతు భరోసా పథకం కోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. కొత్త దరఖాస్తులు, బ్యాంకు ఖాతా వివరాల మార్పునకు జులై 31 వరకు గడువు ఇచ్చింది. జూన్ 15 వరకు పట్టాదారు పాస్‌బుక్ పొందిన వారు, ఇప్పటివరకు లాబ్ది పొందని అర్హులు ఏఈఓలను సంప్రదించగలరని మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

# 31 లోపు రైతు భరోసా కు దరఖస్త చేసుకోండి

### వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రాజ్

ప్రజాపక్షం/పాపన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు భరోసా పథకం కింద జులై 31వ తేదీ రేపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రాజ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త దరఖాస్తులు, బ్యాంకు ఖాతా వివరాల సవరణ కోసం ఈ నెల 31వ తేదీ వరకు మరో అవకాశం కల్పించిందన్నారు. 2026 జూన్ 15వ తేదీ వరకు కొత్త భూ పట్టా పాసుబుక్ పొందిన రైతులు, అలాగే ఇప్పటి వరకు భూ పట్టా పాసుబుక్ ఉన్నప్పటికీ రైతు భరోసా పథకం ప్రయోజనం పొందని అర్హులైన రైతులు తమ బ్యాంకు వివరాలను నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. దరఖాస్తు చేసుకునే రైతులు రైతు భరోసా దరఖాస్తు ఫారం, భూ పట్టా పాసుబుక్ ( పిపిబి) కాపీ, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ లేదా క్యాన్సిల్ చెక్, మొబైల్ నంబర్‌తో పాటు సంబంధిత రైతు వేదికలోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) ను సంప్రదించాలని సూచించారు. అర్హులైన ప్రతి రైతు అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలన్నారు.

## విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** మండలం పరిధిలో గల గడి పెద్దాపూర్ గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని మెదక్ విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) అధికారికి సోమవారం మరి వెల్లి కృష్ణ గౌడ్ గ్రామస్తులు కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో తక్కువ వోల్టేజ్, తరచూ విద్యుత్ అంతరాయాలు, అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడం, దెబ్బతిన్న విద్యుత్ లైన్ల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని గ్రామానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయికిరణ్ ,అనిల్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## మార్షల్ ఆర్ట్సలో వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారి



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** మార్షల్ ఆర్ట్సలో విశేష ప్రతిభ కనబర్చి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారి మల్వే విహాన్ ను సంగారెడ్డి చింతా ప్రభాకర్ తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విహాన్ తన తల్లి దండ్రులు రామేశ్వర్ ఆశ్విన్ తో కలిసి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. చిన్న వయస్సులోనే ప్రపంచ స్థాయిలో గుర్తింపు సాధించి సంగారెడ్డి జిల్లాకు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావడం గర్వకారణమని ఎమ్మెల్యే కొనియాడారు. భవిష్యతులోనే మరిన్ని జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో విజయాలు సాదించి దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షిస్తూ చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జైపాల్ రెడ్డి ,బుచ్చిరెడ్డి ,నరహరెడ్డి ,వసంత్ రెడ్డి పాల్గొని చిన్నారని అభినందించారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మనోహరాబాద్ మండలంలోని చెట్ల గౌరారం గ్రామంలో సర్పంచ్ దివ్య శ్రీహరి గౌడ్, పాలకవర్గ సభ్యులతో కలిసి సోమవారం పోచమ్మ తల్లి ఆలయం వద్ద సుమారు 15 లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామ అభివృదే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవీందర్, వార్డు సభ్యులు మల్లేష్, హజ్ర సుల్తానా, ఇమ్రాన్, నరసయ్య, మాజీ ఎంపీటీసీ నరసింహులు, కాంట్రాక్టర్ సత్యనారాయణ, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కార్యాలయం ముందు గ్రామస్తుల ధర్నా

### ప్రాణాలు తీసే విషపూరిత కాలుష్య పరిశ్రమను తొలగించాలి



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మనోహరాబాద్ మండలంలోని రంగాయిపల్లి,చెట్ల గౌరారం గ్రామాలకు చెందిన ప్రజలు సుమారు 300 మంది ఎమ్మెస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమ విస్తరణను నిలిపివేయాలని కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జి వంటేరు ప్రతాపరెడ్డిల ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. పరిశ్రమ వల్ల నీరు,గాలి,శబ్ద కాలుష్యంతో తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. అధైర్య పడకండి రెండు గ్రామాల ప్రజలకు అండగా బిఆర్ఎస్ పార్టీ ఉంటుందని, ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమ తొలగించే వరకు పోరాటం కొనసాగిద్దామని పద్మ దేవేందర్ రెడ్డి,వంటేరు ప్రతాపరెడ్డిలు గ్రామస్తులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా విషపూరిత జల,వాయు, నేల కాలుష్యం విడుదల చేస్తూ ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమ యాజమాన్యం లాభాల కోసం దిగజారుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు పోతున్న,చర్మవ్యాధులు గుండె సంబంధిత వ్యాధులు,క్యాన్సర్ లాంటి మహమ్మారి బారిన పడి ఆరోగ్యాలు క్షీణిస్తున్న, ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమ యాజమాన్యానికి చీమకుట్టినట్టు కూడా లేదని, డబ్బులతో అధికారులను కొంటూ పరిశ్రమను నడిపిస్తూ పెద్ద ఎత్తున లాభాలు గడిస్తున్నారని మండిపడ్డారు. పరిశ్రమ యాజమాన్యాన్ని ప్రశ్నించినందుకు 11 మంది గ్రామస్తులపై అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇప్పటికైనా పరిశ్రమ వల్ల గ్రామస్తులు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలను గుర్తించి, తమ ప్రాణాలు కాపాడాలంటూ గ్రామస్తులంతా కలిసి కలెక్టర్ కు వినతి పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శేఖర్ గౌడ్,సర్పంచ్ నీలం సాయికుమార్ గౌడ్, మాజీ సర్పంచులు కర్రీ నాగభూషణం ముదిరాజ్, పూల అర్జున్,పంజా బిక్షపతి ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, పిఎసిఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, ఆజాం, దాసరి నరేష్, కర్రె శేఖర్ ముదిరాజ్, పార్టీలకు అతీతంగా గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచులు, మాజీ ఉపసర్పంచ్లు, మండల, గ్రామ అధ్యక్షులు,రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామాల మహిళలు, యువకులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారులకు అభినందనలు



**ప్రజాపక్షం /పటాన్‌చెరు :** గిన్నిస్ వరల్డ్ రికార్డు సాదించిన చిన్నారులకు పటాన్ నియోజకవర్గం శాసన సభ్యుడు గూడెం మహిపాల్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఇటీవల గచ్చిబౌలీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే పోటీలలో బీరం గూడకు చెందిన క్రేజ్‌క్రూ కరాటే ఆకాడమే విద్యార్థులు పాల్గొన్నారు. అద్భుతమైన ప్రదర్శనలతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాదించారు. సోమవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో చిన్నారులను జిఎంఆర్ అభినందించారు. విద్యార్థి స్థాయి నుండి క్రీడల పై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు ,గురువులు, ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ , యాదగిరిరెడ్డి ,సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి , వెంకట్‌రెడ్డి, మల్లేష్, శివారెడ్డి, వెంకటేష్, మేరాజ్ ఖాన్, రామచంద్రర్, రామకృష్ణ, ఆకాడమీ నిర్వాహకులు సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా జగన్నాథ రథయాత్ర



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** హరే కృష్ణ మూవ్ మెంట్ నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్రలో వేలాది మంది భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. హరే కృష్ణ మూవ్ మెంట్ హైదరాబాద్ ఆద్వర్యంలో 19న కోకాపేట్‌లో వైభవంగా శ్రీ జగన్నాథ రథయాత్ర ఘనంగా జరిగింది. వేలాది మంది భక్తులు ఇందులో పాల్గొని భక్తి సంప్రదాయం ,సామాజిక సామరస్యాన్ని చాటిచెప్పారు. శ్రీ జగన్నాథ ,బలదేవ ,సుభద్రా విగ్రహాలను అందంగా అలంకరించిన రథాన్ని అన్ని వర్గాల భక్తులు ఉత్సాహంగా లాగారు. ఊరేగింపు అంతటా సంకీర్తనలు మార్మోగుతూ ప్రసాదం విరివిగా పంపిణి అయ్యింది. 500 మందికి పైగా భక్తులు కలిసి రథాన్ని లాగుతూ సామూహిక అంకితభావాన్ని చాటారు. వాలంటీర్లు ,అనౌన్స్‌మెంట్ వ్యవస్థ భద్రతా బృందాలు తోడ్పడ్డాయి.

**ప్రారంభోత్సవ పూజ, ప్రథమ హారతి**

గణ్యుల చేత చీపురు పట్టే సంప్రదాయ వేడుకతో కార్యక్రమం మొదలైంది. న్యాయమూర్తి శ్రీ సుద్దాల చలపతి రావు, తెలంగాణ హైకోర్టు (ముఖ్య అతిథి) ప్రకాష్‌గౌడ్, ఎమ్మెల్యే రాజేంద్రనగర్, సుదర్శన్‌రెడ్డి అడ్వకేట్ జనరల్ ,ముంగి జైపాల్‌రెడ్డి టీపీసీసీ అదికారి ప్రతినిధి రాజేంద్రనగర్, విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. బాసిల్ పుడ్స్ స్కూల్ పిల్లల నాటికలు , రంగవల్లులు, కోలాటాలు, వంటి సాంస్కృతిక ప్రదర్శనలు వేడుకకు మరింత శోభనిచ్చాయి. 20,000 మందికి పైగా భక్తులకు దొన్న ప్రసాదం వడ్డించారు. బాణా సంచా ప్రదర్శన సాయంత్రం వేడుగకు మరింత సందడి తెచ్చింది.

## కరాటే అంటే కేవలం పోరాట విద్యకాదు

### మాద్రి వృథ్వీరాజ్



**ప్రజాపక్షం /పటాన్‌చెరు :** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు జెడ్పిహెచ్ఎస్ (బాలుర ) పాఠశాలలో నిర్వహించిన తేజా బోడోకాన్ కరాటే డోజోస్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాద్రి వృథ్వీరాజ్ విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ కరాటే విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. నేటి సమాజంలో చిన్నారులు ,ముఖ్యంగా బాలికలు, మహిళలు ఆత్మరక్షణ విద్యను తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కరాటే శారీరక దృఢత్వంతో పాటు మానసిక దైర్యం ,క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసాన్ని పెంపోందిస్తుదని చెప్పారు. గతంలో ఎండిఆర్ ఫౌండేషన్ ఆద్వర్యంలో మహిళలు ,యువతులు, చిన్నారుల కోసం నిర్వహించిన సెల్ఫ్ డిపెన్స్ కార్యక్రమాన్ని గుర్తు చేస్తూ ప్రతి కుటుంబం తమ పిల్లలకు కనీసం ఆక ఆత్మరక్షణ, విద్యను నేర్పించాలని పిలుపు నిచ్చారు. బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలలో పాల్గొన్న విద్యార్థులకు శుభాకాంక్షలు, తెలియజేస్తూ భవిష్యతులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పటానెచెరు పేరు నిలబెట్టాలని ఆకాంక్షించారు.

## యథేచ్ఛగా ప్రభుత్వ శిఖం భూములు కబ్జాలు..!?



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండలంలో ప్రభుత్వ భూములు, చెరు వు శిఖం భూములు యథేచ్ఛగా కబ్జాలకు గురవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది ప్రభావశీలులు అధికార పార్టీ అండదండలతో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాజాగా నార్లపూర్ గ్రామంలోని హైదర్ చెరువు శిఖం భూమిలో సమారు ఐదు ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. అయితే ఆ భూమి ఇరిగేషన్ శాఖ పరిధిలోకి వస్తుందని, రెవెన్యూ శాఖ సంబంధం లేదని ఆయన పేర్కొన్నారు. మండలంలో ప్రభుత్వ భూములు, చెరువుల శిఖం భూములు కబ్జాలకు గువుతున్నా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలను వెంటనే తొలగించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## చేపలు పట్టడానికి వెళ్లి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/నర్సాపూర్:** చేపలు పట్టడానికి వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో పడి మృతి చెందిన సంఘటన నర్సాపూర్ మండల పరిధిలో నిలింగాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. సంఘటన వివరాలు ఎస్సై రంజిత్ మార్ రెడ్డి కథనం ప్రకారం ఎలా ఉన్నాయి. లింగాపూర్ గ్రామానికి చెందిన బొమ్మల చంద్రయ్య (51) చేపలు పడుతూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులందరూ తిని పడుకునే సమయంలో 11 గంటల రాత్రికి బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పాడు. ఇంట్లో నుండి వెళ్లిన వ్యక్తి ఎంతసేపటికి రాకపోవడంతో భార్యతో పాటు కుటుంబ సభ్యులు అందరూ చుట్టుపక్కల వెతికి చూసిన ఆచూకీ లభించలేదన్నారు. మరుసటి రోజు సోమవారం గ్రామ సమీపంలో ఉన్న కొమ్మన్ చెరువు కట్ట పైన మృతుడు చంద్రయ్య బజాజ్ స్కూటర్ చెప్పులు అక్కడ ఉండగా చూసిన కొందరు గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వచ్చి చూడగా చంద్రయ్య వేనని బొమ్మల చంద్రయ్య పొలచుట్టుకొని మృతి చెందాడని తెలిపారు. మృతి చెందిన చంద్రయ్య మృతదేహాన్ని బయటకు తీసి నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. తన భర్త చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నా చెరువులో పడి మృతి చెంది ఉంటాడని మృతుడి భార్య మంజుల తెలిపారన్నారు. మృతుడి చంద్రయ్య భార్య బొమ్మల మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి తెలిపారు.

## గ్యాస్ లీకేజీ ఘటనలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మనోహరాబాద్ మండలంలో పరికిబండ గ్రామ పరిధిలో ఇటీవల అక్రమంగా నిర్వహిస్తున్న గ్యాస్ రీఫిలింగ్ కేంద్రంలో గ్యాస్ లీకేజీ కారణంగా సంభవించిన పేలుడులో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆ ఘటనలో గాయపడిన వారిని హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో బీహార్ రాష్ట్రానికి చెందిన లాలన్ కుమార్ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గాంధీ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపారు.